నవ భావ కుసుమాలు

# ★ చంద్రవంక ★

వేకువ జామున చంద్రవంక.

నీలి ఆకాశంలో తేలిపోతూ, అట్టే నిలచిపోయింది నిన్ను జూస్తూ, సిగ నిగ లాడే చంద్రవంక.

నీవు వెళ్ళిపోతున్నావు.... నిస్సార సత్యంగాదు, లక్ష కన్నీటి చుక్కలకైనా, శతకోటి పూర్వ స్మృతులకైనా...

...అట్లతద్ది:

ఈ చంద్రవంకే మన ఊరి తామర కొలనులో మిల మిల లాడతోంది. నీవూ నేనూ మన నేస్తాలూ నీటిని గిలకొట్టు తున్నాము తెల్లవారుజాము చంద్రవంకను జూస్తూ. చల్లని నీటిలో మన గోరింటాకు ఎర్రని చేతులు కలుసుకున్నాయి.

"అబ్బ!" అన్నావు, నీవు, ప్రియమైన బాధతో, నా చేతిలోని నీ చేతిని వదలించుకో లేక - జ్ఞాపక ముందీ?

....విజయదశమి ;

మన చేత గిలకలు పట్టిస్తున్నారు.

అమ్మ మన కిద్దరకూ తలంటి నీళ్లోసి, ముఖమల్ బట్టలు తొడిగింది నా మెళ్లో తన కాసుల పేరు వేసి. నీకు కంటే వడ్డాణమూ పెట్టింది. నా బుగ్గను చుక్కపెట్టి నీ నుదుట ఎర్రని చంద్రవంకను దిద్దింది. చిన్ని జాబిల్లి వంపు మధ్య మిణుకు మిణుకు మనే నక్షత్రం.

"కళ్యాణపు బొట్టే, కోడలా, కళ్యాణపు బొట్టు!" అన్నది, అమ్మ, నవ్వుతూ.

సిగ్గుతో తలవంచుకున్నావు, నీవు.

గర్వంతో నీకేసి చూశాను, నేను.

మరు క్షణము, గిలక నారి సారించి లాగి కొట్టావు, నా ముఖం నిండా, ఇంత ఎర్రని బుక్కా, కిల కిల నవ్వుతూ- జ్ఞాపక ముందా? ఆ నవ్వు వినిపిస్తోంది, ఈ నిమిషమున్నూ.

........ దీపావళి :

నీవు మొదటి ప్రమిదను వెలిగించాక, అమ్మ అన్నది: "ముందు, తీపి తినాలి మీరు!.... పిల్లా! బావకు జిలేబీ పెట్టవే!" అని.

నేను తిననని బెట్టుచేస్తే, నీ పెదవుల మధ్య నుండి అందిచ్చావు తీయ తీయని జిలేబీని- అమ్మ. ఏమీ ఎరగనట్టు. అటు చూస్తోంటగా, జ్ఞాపకముందీ,

కాకర పువ్వొత్తుల వెలుగులో ఎంత ధగ ధగ ప్రకాశిస్తున్నాయి, నీకళ్లు! ఎన్ని మెరుపులు మెరుస్తున్నాయి, ఎన్ని నక్షత్రాలు రాలుతున్నాయి, నీ చేతినుంచి!

ఉన్నట్టుండి, వీధిలో, మరీ పెద్ద టపాకాయ శతఘ్నిలా పేలగా నీవు జడుసుకుని, "బావా!" అంటూ నా ఒళ్ళో పడ్డావు.

ఏనాటి కౌగిలి అది!...... అబ్బ!!

........ ఎన్నో ఏళ్ల తర్వాత :

గోదావరి నది దాటుతున్నాము మనము. పడవలో, లక్ష కెరటాలపైన తేలిపోతుంది ఈ చంద్రవంకే.

ఆ అతిప్రశాంత సమయాన నీవు సన్నని కంఠస్వరంతో పాడుతున్నావు నా కోసము ఓ క్షీరసాగర శయనా! నను చింతల బెట్టపలెనా!" అంటూ. "ఎంత జాలిగా ఉన్నది, నీ గానము!" అన్నాను, నేను - జ్ఞాపక ముందీ?

నీవు మాట్లాడలేదు. కళ్లు మూసుకున్నావు.
నీ చెక్కిలి పైకి జారే కన్నీటి ముత్యములోని చంద్రవంకను
భక్తితో ముద్దు పెట్టుకున్నాను, నేను, - భక్తితో.
ఆ కన్నీరు అల్లాగే వున్నది, నా పెదవులపైన, ఇంకా.
దేవీ!........

........ సంవత్సరాది :

బొమ్మల ప్రదర్శనలో చంద్రశేఖరుని బొమ్మను చూస్తున్నాము, మనము.

ధ్యాన నిమగ్నుడైన పరమ శివుని జటా జూటానికి పైగా, ఆకాశాన, చిన్ని వెన్నెల కందు, చిరునవ్వుల ప్రోవు.

"ప్రమోద కుమారుని తపస్సు ఫలించినది!" అన్నాను, నేను.

"మన ఇద్దరి తపః ఫలమూను!!" అన్నావు, నీవు, నా చేతిని నీ చేతిలోకి తీసుకుంటూ, - జ్ఞాపక ముందీ?

ఎప్పటి మాట!

........ నీ పుట్టిన రోజు :

సింగారించుకుంటున్న నీ వద్దకు వచ్చాను, నేను దోసిలి నిండా పారిజాతాలూ పారిజాతాల మధ్య రత్నాల చంద్రవంకాతో.

రచన: శ్రీ ఆచంట జానకిరామ్

"ఏదీ! ఇటు తిరుగూ!" అన్నాను, నేను.

సంభ్రమములో నావైపు తిరిగిన నిన్ను కౌగిలించుకుని, నీ ఫాలభాగాన రేఖగా ముద్దు పెట్టుకున్నాను.

ముందుకు వంగి, నీపాపట సిందూరము పైన అలంకరించాను రత్నమాణిక్యాలు తాపిన బంగారపు చంద్రవంకను.

"ఎంత సొగసుగా ఉన్నది, నీ తలపైన చంద్రవంక! చూచుకో, అద్దములో" అని, నేననగా, నీవన్నావు:

"అద్దమెందుకూ, మీరు నా యెదుట ఉండగా" అని, నీ సోగకన్నుల లేత చిరునవ్వుతో- జ్ఞాపక ముందీ?

.... ఆ చిరునవ్వే ఆత్మ రక్షణ, నా కిపుడు.

.... నీవు వెళ్ళిపోయావు.

నీలి ఆకాశంలో అటే నిలచిపోయింది, చంద్రవంక, నిన్ను జూస్తూ,

వేకువజామున చంద్రవంక!


మరపు రాకాసి నొకచేత నరకివైచి
మంచి జ్ఞాపకశక్తి పుట్టించు నట్టి
మా సుధీప్రకాశ్"కు సాటిమందులేదు
సేవన మొనర్ప మీరతే చెప్పగలరు.

సుధీప్రకాశ్ బుద్ధిబలమును వృద్ధిచేసి దేహబలము నొసగును.

6 ఔన్సుల సీసా రు. 2-0-0

శ్రీ లక్ష్మీనృసింహ ఆయుర్వేద వైద్యశాల
మచిలీపట్నం


# కొత్తబాట

(గేయం)

రచన :- శ్రీ "అమరేంద్ర"

పాత పాటలు వినను పొమ్మందిరా
జనత
కొత్తబాటల కదిలి రమ్మందిరా!
సొంత గొంతుక విప్ప కొందిరా
కవిత
ఎంత పదములు చాలు లెమ్మందిరా!
వాడిపోయిన ఉపమలెందుకు?
అరిగిపోయిన పలుకు లెందుకు?
భావ చైతన్యమ్ము నెరుగని
జీవరహిత ప్రతిమ లెందుకు?
పరిమళించని కాగితమ్ముల
పట్టిరంగుల పూవులెందుకు?
మాట ఒక్కటియైన మనసున
మధురముగ స్పందింప వలదా?
కారు మబ్బుల అంచులో ఒక
కాంతిరేఖ నటింప చాలదా?
హృదయ శాద్వలములను చీల్చిన
మృదు తృణాంకుర మొకటి చాలును!
ఎరుపు సొమ్ములు బరువుచేసి
సృజన శక్తియె నేల కూలును!
సంనారుల సరాల తారలు
వరాల స్వరాల నరాల మ్రోగగ
నవ్యాశా సౌరభాలతో
నలుదిక్కుల నవ్వులు పూయగ
పాత పాటలు వినను పొమ్మందిరా
జనత!
కొత్త బాటల కదిలి రమ్మందిరా.

# జాజిపాటలు

ఓ కోకిలా! ఓ కోకిలా!
ఓ కోకిలా! ఓ కోకిలా!

మా కంద తరువుపై
పోకిళ్ల పోకే
నీ కారు చిచ్చుల తల
వాకిలిని తీయకే.

నీ కనులలో నిప్పు
కలు పోసికొని ఓసి
నా చెవులలో పిడుగు
పాటు కల్పింపకే.

నా పయిని నీ గొంతు
లో పొగరు చూపకే
నా యెడద పొలచిచ్చు
నూది రగిలింపకే.

ఏకాకి నను జూచి
నీ కాకితనము
బుద్ధి లోపల కూడ
పొటమ రింపకువే,

శ్రీ పైడిపాటి సుబ్బరాయశాస్త్రి